కార్యదర్శులు కష్టపడి పనిచేయాలి

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ఘనంగా పంచాయతీ కార్యదర్శుల ఆత్మీయ సమ్మేళనం

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క. చిత్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

పెద్దఅంబర్‌పేట, మే 10: పంచాయతీ కార్యదర్శులు ఇష్టంతో కష్టపడి పని చేయాలని, ఒత్తిడికి గురికావొద్దని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం పెద్దఅంబర్‌పేటలోని ఓ కన్వెన్షన్‌లో పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పాల్గొన్న సీతక్క మాట్లాడుతూ.. కార్యదర్శులు కొత్తగా ఆలోచించాలని, గ్రామాల్లో నూతన మార్పులు తీసుకురావాలని సూచించారు. కార్యదర్శులకు పని ఒత్తిడి ఉన్న మాట వాస్తవమేనని, వారి న్యాయమైన డిమాండ్ల సాధనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నెలాఖరులో ఫెడరేషన్ ముఖ్యప్రతినిధులతో డిమాండ్లపై సమీక్షిస్తామని తెలిపారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేని ప్రస్తుత సమయంలో అన్నిఅయి ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పనులకు కార్యదర్శులు ఎలా జవాబుదారీగా ఉంటారో, వారి సమస్యలపై కూడా ప్రభుత్వం అంతే సానుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఎమెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సంఘాల ప్రతినిధులు హర్షవర్ధన్ రెడ్డి, టీపీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, ఇతర ప్రతినిధులు సందీప్, నాగరాజు, కృష్ణంరాజు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బింగి దాసుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సదరం రాదు.. సాయం అందదు

- సర్టిఫికెట్ కోసం రెండు నెలలుగా తిరుగుతున్న ఓ దివ్యాంగుడు
- రోడ్డు ప్రమాదంలో కాలు తొలగింపు..
- కుటుంబ పోషణ భారంగా మారిందని, సర్టిఫికెట్ ఇప్పించి ఆదుకోవాలని వేడుకోలు

మొయినాబాద్, మే 10: మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన పుల్లగల్ల పద్మారావుకు గత 5 నెలల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడి కాలు విరిగింది. దీంతో చికిత్స సమయంలో ఆ కాలును మోకాలు మీది వరకు పూర్తిగా తొలగించారు. కాలు లేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. దీంతో ప్రభుత్వం అందిస్తున్న 'చేయూత' పథకానికి దరఖాస్తు చేసుకుంటే పింఛన్ కుటుంబానికి కొంత ఆసరా అవుతుందని అధికారులను ఆశ్రయించాడు. 'చేయూత'కు సదరం క్యాంపు ద్వారా ఇచ్చే సదరం సర్టిఫికెట్ తప్పనిసరి అని అధికారులు సూచించారు. అధికారుల సలహా మేరకు బాధితుడు పద్మారావు మీ-సేవలో సదరం సర్టిఫికెట్ కోసం ఫిబ్రవరి 12వ తేదీన స్లాట్ బుక్ చేసుకున్నాడు. అయితే ఆ స్లాట్ బుకింగ్‌లో ఎప్పుడు సదరం క్యాంపునకు రావాలో తేదీని మాత్రం ఇవ్వలేదు. సదరం క్యాంపు నుంచి ఎప్పుడు ఫోన్ కాల్ వస్తుందోనని నెల రోజులుగా వేచి చూశాడు. బుక్ చేసుకున్న నెల తరువాత కొండాపూర్‌లో నిర్వహించిన సదరం క్యాంపునకు వెళ్లగా.. మీకు ఫోన్ కాల్ చేస్తాం.. మేము పిలిచినప్పుడు రావాలని చెప్పి తిప్పి పంపారు. కాల్ రాలేదని మళ్లీ సదరం క్యాంపు వద్దకు వెళ్లాడు. వెళ్లినప్పుడల్లా ఫోన్ కాల్ చేస్తామని చెప్పడం తప్పా ఫోన్ కాల్ మాత్రం రాలేదు. ఇలా నాలుగు సార్లు సదరం క్యాంపు వద్దకు వెళ్లగా.. మేము పిలిచినప్పుడు మాత్రమే రావాలని తిప్పి పంపడం తప్ప అతడికి సదరం సర్టిఫికెట్ ఇవ్వడంలేదు. ఆ సర్టిఫికెట్ కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ సరైన సలహా ఇవ్వడం లేదని ఆ దివ్యాంగుడు నీరసించి పింఛన్ వచ్చేటట్లులేదని ఆందోళన చెందుతూ ఉండిపోయాడు.

పింఛన్‌కు సదరం సర్టిఫికెట్ కోసం మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన దివ్యాంగుడు పద్మారావు

సర్టిఫికెట్ ఇప్పించి ఆదుకోండి..

పింఛన్‌కు దరఖాస్తు పెట్టుకోవడానికి అధికారుల వద్దకు వెళ్లాను. వికలాంగులకు పెన్షన్ కావాలి అంటే ముందుగా సదరం సర్టిఫికెట్ కావాలని చెప్పారు. రెడ్డిపల్లిలో మీ-సేవలో దరఖాస్తు చేసుకున్నాను. కొండాపూర్‌లో సదరం క్యాంపు ఉంటుందని, ఫోన్ కాల్ వచ్చినప్పుడు వెళ్లాలని చెప్పారు. వెళ్లిన ప్రతిసారి ఫోన్ చేసినప్పుడే రావాలని చెప్పి తిప్పి పంపించారు. అలా నాలుగు సార్లు వెళ్లాను. కానీ ఇప్పటి వరకు సదరం క్యాంపు నుంచి నాకు ఫోన్ కాల్ రాలేదు. దీంతో కలెక్టర్ కార్యాలయానికి వెళ్లగా.. కొండాపూర్‌లో నిర్వహించే సదరం క్యాంపునకు వెళితే కాల్ చేసినప్పుడే రావాలని క్యాంపు వద్ద చెప్పారని కలెక్టర్ కార్యాలయంలోని అధికారులకు చెప్పాను. అయితే ఇబ్రహీంపట్నంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానలో నిర్వహించే సదరం క్యాంపునకు వెళ్లాలని అక్కడి అధికారులు సలహా ఇచ్చారు. వారి సలహా ప్రకారం.. ఇబ్రహీంపట్నం వెళ్లాను. అక్కడికి వెళ్లితే మీ ప్రాంతం వారికి కొండాపూర్‌లో సదరం క్యాంపు ఏర్పాటు చేశారని, అక్కడికే వెళ్లాలని తిప్పి పంపించారు. అటూ ఇటూ తిరగడం తప్ప సదరం సర్టిఫికెట్ మాత్రం లభించే పరిస్థితి కనిపించడంలేదు. ఎవరిని అడిగినా ఎవరూ కూడా సరైనా పరిష్కారం చూపడంలేదు. కుటుంబాన్ని పోషించుకోవడం భారంగా మారింది. నా ఆవేదనను ఉన్నతాధికారులు అయినా అర్థం చేసుకుని సదరం క్యాంపు ద్వారా సర్టిఫికెట్ అందేలా చూడాలని కోరుతున్నా.

– పద్మారావు, దివ్యాంగుడు

స్లాట్ బుక్ చేసుకోవాలి

సదరం సర్టిఫికెట్ పొందాలి అంటే తప్పనిసరిగా మీ-సేవలో స్లాట్ బుక్ చేసుకోవాలి. బుక్ చేసుకున్నప్పుడే ఏ డేట్‌కు రావాలో డేట్ కూడా ఇస్తారు. ఆ డేట్ ప్రకారం వెళ్లి చెక్ చేయించుకుని సర్టిఫికెట్ పొందవచ్చు. మే నెల నుంచి సదరం క్యాంపు వేసవి సెలవుల నేపథ్యంలో నిలిపివేసి ఉంటారు. కాని అంతకు ముందు తప్పనిసరిగా సదరం క్యాంపు కొండాపూర్ జిల్లా ప్రభుత్వ దవాఖానలో ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతం వారికి కొండాపూర్‌లో వైద్య పరీక్షలు చేసి అంగవైకల్యం ఆధారంగా సర్టిఫికెట్ జారీ చేస్తారు. అతడు స్లాట్ బుక్ అయిన డేట్ రోజు వెళ్లకపోవచ్చు. క్యాంపు లేని రోజు వెళ్లితే ఉపయోగం ఉండదు.

– రవీందర్, ఏపీఎం, మొయినాబాద్

సప్లైచైన్‌తో పరిశోధనల్లో

మరింత వేగం

సిటీబ్యూరో, మే 10 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని అస్పైర్-బయోనెస్ట్‌లో థర్మో ఫిషర్ సైంటిఫిక్ అనే సంస్థ ప్రత్యేకమైన సప్లై చైన్ సెంటర్‌ను ప్రారంభించింది. అస్పైర్-బయోనెస్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజగోపాల్, థర్మో ఫిషర్ సైంటిఫిక్ డైరెక్టర్ జాక్వలిన్ ఎన్‌జీ కలిసి శనివారం దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'జీవసాంకేతిక రంగంలో పరిశోధనను వేగవంతం చేయడానికి రూపొందించిన మొదటి ప్రదేశమిది. ఈ సెంటర్‌ను బయో-ఇంక్యుబేషన్ పరికల్పనలో భాగంగా స్థాపించడం విశేషం. దేశవ్యాప్తంగా ఎంపికైన నాలుగు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లలో అస్పైర్- బయోనెస్ట్ ఒకటి. ఈ కలయిక ద్వారా పరిశోధన, అభివృద్ధి మరింత సమర్థవంతంగా కొనసాగనుంది. సప్లై సెంటర్ ద్వారా అవసరమైన రసాయనాలు, ల్యాబ్ కాన్సుమబుల్స్ తదితర సామగ్రి అదేరోజు లేదా తదుపరి పని రోజులో అందుబాటులోకి వస్తాయని' వివరించారు. దీని ద్వారా స్టార్టప్‌లు, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, టీఐఎఫ్‌ఆర్, ఎన్ఐఏబీ, ఐఐఎల్ లాంటి పక్కనున్న పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలు నేరుగా ప్రయోజనం పొందనున్నారు. ఈ భాగస్వామ్యం గ్లోబల్ పరిశ్రమలు. భారతీయ పరిశోధనా కేంద్రాల మధ్య సాంకేతిక సహకారానికి ఒక నిదర్శనంగా నిలువనుంది. నూతన ఆవిష్కరణలకు మార్గం వేసే మౌలిక వసతుల్ని అందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది.

సైనికుల కోసం 147 మంది రక్తదానం

షాద్‌నగర్‌లో రక్తమిచ్చిన మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్ అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు

షాద్‌నగర్ పట్టణంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్

షాద్‌నగర్, మే 10: దేశ సరిహద్దులో ప్రాణాలకు తెగించి పోరాడే సాయుధ దళాలకు మనమందరం అండగా ఉండాల్సిన సమయం వచ్చిందని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్ అన్నారు. శనివారం ఆయన జన్మదినం సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలోని రెడ్ రోజ్ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ శ్రేణులు, అభిమానులు దేశ సైనికుల కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రాణాలకు తెగించి పోరాడే సైనికులు మన ప్రాణదాతలు అయితే తమ రక్తాన్ని అందించే సేవకులు మన రక్త దాతలని అన్నారు. దేశ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ దేశ సాయుధ బలగాలకు మన వంతుగా సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. యుద్ధ పరిస్థితిలో రక్తం చాలా అవసరం ఉంటుందని, అందుకు యువత స్వచ్ఛందగా ముందుకు వచ్చి రక్త దానం చేయాలని పిలుపునిచ్చారు. పాలమూరు బ్లడ్ బ్యాంక్, షాద్‌నగర్ సర్కారు దవాఖాన సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన రక్త దాన శిబిరంలో 147 మంది రక్త దానం చేయడం సంతోషంగా ఉందన్నారు. రక్తదానం చేసిన ప్రతిఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, మాజీ కౌన్సిలర్ బచ్చలి నర్సింహ, బీఆర్ఎస్ నాయకుడు భీమారం వీరేశం, మున్సిపల్ 7వ వార్డు అధ్యక్షుడు కల్వగురి వెంకటేశ్ గుప్త, బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు లంకాల రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అంజయ్య యాదవ్ జన్మదినం నిర్వహించారు. వృద్ధులకు, అనాథలకు అన్నదానం చేసి చీరలను పంపిణీ చేశారు.

అంజయ్య యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్, కవిత

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్ ప్రత్యేకంగా ఫోన్ చేసి అంజయ్యయాదవ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

కార్మిక బీమా.. ఏదీ ధీమా!

వైద్యులు లేక.. ఉన్నవాళ్లు సమయానికి రాక కార్మికుల ఇబ్బందులు

సరిపడా మందులు లేకపోవడంతో ప్రైవేట్ ఫార్మసీలకు వెళ్తున్న వైనం

సిటీబ్యూరో, మే 10 (నమస్తే తెలంగాణ): సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు వైద్య సేవలందించాల్సిన ఈఎస్‌ఐ వైద్యంలో నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. వైద్యం చేయించుకునేందుకు వచ్చినవారికి ఒకవైపు వైద్యులు లేకపోవడం మరోవైపు కావాల్సిన మందులు దొరక్కపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. పేరుకు మాత్రమే కార్మిక బీమా ఉన్నదని, కార్మికులకు వైద్యంలో ధీమా ఎక్కడున్నదని వాపోతున్నారు.

తూతూ మంత్రంగా సేవలు..

గ్రేటర్ పరిధిలో సుమారు 10 లక్షల మంది ఈఎస్‌ఐ కార్డులు కలిగి ఉన్నారు. ఖైరతాబాద్, బాలానగర్, సనత్‌నగర్. చప్పల్‌బజార్, చిక్కడపల్లి, చిలకలగూడ, డబీర్‌పురా, ఫతేనగర్, గోల్కొండ, గోషామహల్, హిమ్మత్‌పురా, కవాడిగూడ, విద్యానగర్, రామంతాపూర్, రాణిగంజ్, సికింద్రాబాద్, తార్నాక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈఎస్‌ఐ డిస్పెన్సరీలకు నిత్యం ఒక్కో సెంటర్‌కు రోజుకు 150 మంది వివిధ అనారోగ్య సమస్యలతో ఔట్ పేషెంట్లు వస్తుండటం గమనార్హం. 3వేల మందికి పైగా ఈఎస్‌ఐ కార్డుదారులకు ఒక్కోటి చొప్పున ఈఎస్‌ఐ డిస్పెన్సరీలు ఏర్పాటు చేశారు. అయితే జిల్లాలోని పలు డిస్పెన్సరీల్లో మెడికల్ అధికారులు లేరు. దీంతో రోగులు వైద్యం కోసం ఇతర డిస్పెన్సరీలకు వెళ్లే పరిస్థితి నెలకొంటున్నది. కొన్ని చోట్ల తూతూ మంత్రంగా ఓపీ నిర్వహిస్తూ, మధ్యాహ్నం తరువాత సెంటర్లలో ఉండకపోవడంతో ఏఎన్ఎంలే చికిత్సనందిస్తున్న పరిస్థితి ఉంది.

ప్రైవేట్ ఫార్మసీలను ఆశ్రయిస్తూ..

దీర్ఘకాలిక వ్యాధులలో బాధపడుతూ డిస్పెన్సరీలకు వచ్చేవారికి నిరాశే మిగులుతున్నది. కావాల్సిన మందులు అందుబాటులో లేకపోవడంతో చేసేదిలేక ప్రైవేట్ ఫార్మసీల్లో కావాల్సిన మందులు కొనుక్కుంటున్నారు. ప్రతిసారీ పూర్తిస్థాయిలో కావాల్సిన మందులు ఇవ్వడం లేదని, వచ్చే జీతంలో మందులకే ఖర్చు చేయాల్సి వస్తున్నదని కార్మికులు వాపోతున్నారు. మరోవైపు పలువురు డబ్బులు పెట్టే స్థోమత లేక, ఫార్మసిస్టులు చెప్పినట్లు అనేక సార్లు సెంటర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ, పనులకు ఆలస్యంగా వెళ్తూ యజమానితో తిట్లు తింటున్నారు. పేద కార్మికులకు వరంగా మారిన ఈఎస్‌ఐ వైద్యాన్ని గాడిలో పెట్టాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది.

మాతృమూర్తులను సత్కరిస్తున్న ఆస్పత్రి యాజమాన్యం

కన్నబిడ్డలకు కిడ్నీలు దానం

మాతృమూర్తులకు ఘన సత్కారం

ఖైరతాబాద్, మే 10: కిడ్నీ ఫెయిల్యూర్ అయిన తమ కొడుకులు, కుమార్తెలకు మూత్రపిండాలను దానం చేసిన మాతృమూర్తులను ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ యాజమాన్యం సత్కరించింది. మాతృదినోత్సవం సందర్భంగా ఎర్రమంజిల్‌లోని ఆస్పత్రిలో శనివారం 'అమ్మ ఇచ్చిన రెండో జీవితం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ నెఫ్రాలజీ కన్సల్టెంట్ డాక్టర్ ఎం.వెంకటేశ్వ రావు, డాక్టర్ పీఎస్ వలీ మాట్లాడుతూ.. తమ పిల్లలకు నిస్వార్థంగా తమ సొంత కిడ్నీలు దానం చేసి వారి ప్రాణాలను రెండోసారి నిలబెట్టిన మాతృమూర్తులను గౌరవించుకోవడం మన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సుజీత్ రెడ్డి, డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

సిబిల్ బావుంటేనే రుణాలు!

- రాజీవ్ యువ వికాసం పథకానికి సర్కార్ కొర్రీలు!
- సిబిల్ స్కోర్ ఆధారంగానే రుణాల మంజూరు ఉంటుందని ప్రచారం
- అర్హులకు అందేనా..?అంటూ నిరుద్యోగుల్లో ఆందోళన



చేవెళ్ల రూరల్, మే 10 : కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నది. గతంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా ఇవ్వాల్సిన సబ్సిడీతో కూడిన రుణాలిచ్చే పథకాన్ని కొత్తగా రాజీవ్ యువ వికాస్ పథకంగా పేరు మార్చి.. అసలైన లబ్ధిదారులకు ఇవ్వకుండా సవాలక్ష కొర్రీలు పెడుతున్నది. తాజాగా రాజీవ్ యువ వికాస్ పథకానికి సంబంధించి మండల అభివృద్ధి అధికారులు సంబంధిత శాఖలు, బ్యాంకర్లతో సమావేశం ఏర్పా టు చేసి దరఖాస్తుదారుల సబిల్ స్కోర్ చెక్ చేయాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ విషయంపై లబ్ధిదారుల్లో గందరగోళం నెలకొన్నది.

అర్హులకు అందనట్లే..

బ్యాంకు సిబిల్ స్కోర్ ఆధారంగా అర్హుల ఎంపిక జరిగితే నిరుపేదలకు పథకం అందనట్లే అని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబిల్ స్కోర్ మంచిగా ఉన్నవారు అనునిత్యం బ్యాంకు లావాదేవీలు అధికంగా సాగించే వారే ఉంటారు కాబట్టి వారికే మొదటి ప్రాధాన్యత కల్పించేందుకు బ్యాంకులు రుణం ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నాయని తెలుస్తున్నది.

ప్రతి పథకానికి ఏదో ఒక కొర్రీ..

ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయలేక.. ఏదో ఒక కొర్రీ పెడుతూ కొంత మందికే ఇచ్చి చేతులు దులుపుకోవాలని సర్కారు చూస్తున్నదని పలువురు మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సిబిల్ స్కోర్‌తో ముడిపెట్టొద్దు..

రాజీవ్ యువ వికాస్ పథకాన్ని బ్యాంకు సిబిల్ స్కోర్‌తో ముడిపెట్టొద్దు. ఆ విధంగా చేస్తే పేదలకు అన్యాయం జరుగుతుంది. ఇప్పటికే బ్యాంకు బాధితులుగా మారిన ఎంతో మంది పేదలు గతంలో తీసుకున్న లోన్లు, వాటికి సంబంధించిన చెల్లింపులు కట్టని కారణంగా వారి సిబిల్ స్కోర్ తగ్గి ఉంటుంది. తద్వారా వారికి రుణం మంజూరు అయ్యే అవకాశం తక్కువగా ఉంటుంది.

– వెంకటేశ్, శంకర్‌పల్లి మున్సిపాలిటీ

జుమోటో డెలివరీ బాయ్‌పై దాడి..

పంచకట్టు దోశ సిబ్బందిపై కేసు

బంజారాహిల్స్, మే 10: అకారణంగా జుమోటో డెలివరీ బాయ్‌పై దాడికి పాల్పడిన హోటల్ సిబ్బందిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు నమోదయింది. వివరాల్లోకి వెళ్తే..బంజారాహిల్స్ రోడ్ నం.2లో నివాసం ఉంటున్న ప్రభాత్‌కుమార్(33) జుమోటో డెలివరీ బాయ్‌గా పనిచేస్తుంటాడు. విధి నిర్వహణలో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నం.2లోని పంచకట్టు దోశ హోటల్‌లోని సెల్లార్‌కు వెళ్లి ఆర్డర్‌ను డెలివరీ తీసుకున్నాడు. బిల్లును ఆన్‌లైన్‌లో చెల్లించేందుకు ప్రయత్నిసుండగా నెట్‌వర్క్ ప్రాబ్లమ్ వల్ల కనెక్ట్ కాలేదు. దీంతో బయటకు వెళ్లి డబ్బులు పంపిస్తానంటూ ప్రభాత్‌కుమార్ చెప్పాడు. దీంతో హోటల్ సిబ్బంది ఆగ్రహంతో ప్రభాత్‌కుమార్‌ను చితకబాదారు. ఈ మేరకు బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి

గురునానక్ ఇంజినీరింగ్ కళాశాల వసతిగృహంలో ఉరేసుకుని..

తల్లిదండ్రులు రాకముందే మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించిన పోలీసులు

ఆందోళనకు దిగిన విద్యార్థి సంఘాల నాయకులు

కళాశాల గేటుపైకి ఎక్కి కళాశాలలోకి చొరబడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఇబ్రహీంపట్నం, మే 10 : అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇబ్రహీంపట్నం గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో చోటుచేసుకున్నది. తోటి విద్యార్థులు, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐ జగదీశ్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కుర్నవెల్లి గ్రామానికి చెందిన అల్లూరి కిట్టమ్మ, శశిరెడ్డి దంపతుల రెండో కుమార్తె భావన (22) ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలోని వసతి గృహంలో ఉంటూ బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. అయితే, శనివారం ఉదయం 10 గంటల సమయంలో వసతి గృహంలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన వసతిగృహం వార్డెన్ తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీరాజు, సీఐ జగదీశ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం మార్చురీకి తరలించారు. భావన తల్లిదండ్రులు హైదరాబాద్ నగరంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. విద్యార్థి భావన మృతిపై తోటి విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థిని భావన(ఫైల్)

ఆత్మహత్యలకు నిలయంగా కళాశాల : ఎస్ఎఫ్ఐ

కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న విషయం తల్లిదండ్రులకు సమాచారమివ్వకుండానే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించడం సరైన పద్ధతి కాదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శంకర్, ప్రణయ్ అన్నారు. ఈ సందర్భంగా వారి ఆధ్వర్యంలో కళాశాల ముందు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ముఖ్యంగా గురునానక్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల ఆత్మహత్యలకు నిలయంగా మారిందని, ఈ విషయమై ఎవరూ పట్టించుకోవడం లేదని ఆందోళన చేశారు. ఆందోళనకారులు కళాశాలలోకి ప్రవేశించకుండా కళాశాల సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు ప్రధాన గేటు వద్ద అడ్డుకున్నారు. దీంతో ఆందోళన కారులు కళాశాల గేట్లపై నుంచి కళాశాలలోకి చొరబడ్డారు. విద్యార్థిని మృతి పట్ల సరైన సమాచారం లేకుండానే కళాశాల యాజమాన్యం, పోలీసులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, కళాశాల యాజమాన్యంపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన విద్యార్థి సంఘాల నాయకులను అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు యువకుల సజీవ దహనం
- చికిత్స పొందుతూ మరొకడు మృతి
- ఆగిఉన్న వాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్న కారు
- మంటలు చెలరేగి ప్రాణాలు విడిచిన యువకులు
- పెద్దఅంబర్‌పేట సమీపంలోని గండిచెర్వు వద్ద ఘటన

మంటల్లో కాలిపోతున్న రెండు వాహనాలు

పెద్దఅంబర్‌పేట, మే 10: అవుట్ రింగ్ రోడ్డుపై శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొని ఇద్దరు యువకులు సజీవ దహనమయ్యారు. మరో యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్దఅంబర్‌పేట సమీపంలోని గండిచెర్వు బ్రిడ్జి వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని బహదూర్‌పుర హెచ్‌బీ కాలనీకి చెందిన దీపేశ్ అగర్వాల్ (23) తన స్నేహితులు వీటీసీ విజయనగర్ కాలనీకి చెందిన సంచయ్ మల్వాని(22), మూసాపేట్‌కు చెందిన ప్రియాన్షు మిట్టల్ (23)తో కలిసి కారులో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత శంషాబాద్ వైపు నుంచి ఘట్‌కేసర్ వైపు వెళ్తున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గండిచెర్వు బ్రిడ్జి సమీపంలోకి రాగానే.. ఓఆర్ఆర్‌పై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా నోపార్కింగ్ ప్రాంతంలో నిలిపిన బొలేరో గూడ్సు వాహనాన్ని వెనుక నుంచి కారు వేగంగా ఢీకొట్టింది. కారు ముందున్న బొలేరో వాహనంలో ఇరుక్కుపోయింది. రెండు వాహనాల్లో మంటలు చెలరేగాయి. కాలిపోతున్న బొలేరో వాహనాన్ని డ్రైవరు ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేయగా.. మంటలు మరింత చెలరేగాయి. తోటి వాహనదారులు సహాయక చర్యలు చేపట్టేలోగానే దీపేశ్ అగర్వాల్, సంచయ్ మల్వాని సజీవ దహనం అయ్యారు. తీవ్రంగా కాలిన గాయాలైన ప్రియాన్షు మిట్టల్‌ను అతికష్టంగా బయటకు తీశారు. అంబులెన్సులో నగరంలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ తెల్లవారుజామునే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. నోపార్కింగ్ ప్రాంతంలో బొలేరో వాహనం నిలుపడం వల్లే ప్రమాదం జరిగిందని దీపేశ్ అగర్వాల్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. స్నేహితులను కలిసి వస్తానని వెళ్లిన కొడుకు మృత్యువాతపడటంపై దీపేశ్ తండ్రి కన్నీటి పర్యంతమయ్యాడు.

ఒకరి సాయం.. ముగ్గురికి శాపం

శుక్రవారం అర్ధరాత్రి తర్వాత పెద్దఅంబర్‌పేట సమీపంలోని గండి చెర్వు బ్రిడ్జి వద్ద ఓఆర్ఆర్‌పై ఓ లారీని గూడ్సు బొలేరో వాహనం కొద్దిగా ఢీకొట్టింది. దీంతో బొలేరో వాహనం డివైడర్ మధ్యలో ఆగిపోయింది. డివైడర్ మధ్య ఆగిన బొలేరో వాహనాన్ని పక్కకు తప్పించేందుకు పలువురు ప్రయత్నించారు. సహాయక చర్యలను చూసిన మరో బొలేరో వాహనం డ్రైవర్ తన బండిని పక్కన ఆపాడు. సహాయక చర్యల్లో పాలుపంచుకున్నాడు. ఇదే సమయంలో యువకులు దీపేశ్ అగర్వాల్, సంచయ్ మల్వాని, ప్రియాన్షు మిట్టల్ కారులో అతివేగంగా అటుగా వెళ్తున్నట్టు సమాచారం. దగ్గరకు వచ్చాక అకస్మాత్తుగా డివైడర్ మధ్యలో ఉన్న వాహనాన్ని గుర్తించి, ఒక్కసారిగా పక్క లేన్‌లలోకి వెళ్లినట్టు తెలుస్తున్నది. పక్కన ఆగి ఉన్న బొలేరో వాహనాన్ని అతివేగంగా వెనుక నుంచి ఢీకొట్టినట్టు తోటి వాహనదారులు చెబుతున్నారు. ఒకరికి సాయం చేద్దామని డ్రైవర్ ప్రయత్నిస్తే.. అదే ముగ్గురి పాలిట మృత్యుశాపంగా మారినట్టు తెలుస్తున్నది. యువకులు ముగ్గురు వ్యాపారం చేస్తుంటారు.

శంషాబాద్ విమానాశ్రయం పరిసరాల్లో డ్రోన్‌లపై నిషేధం

సిటీబ్యూరో, మే 10 (నమస్తే తెలంగాణ): భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసరాల్లో డ్రోన్‌లు ఎగురవేయడంపై నిషేధం విధిస్తున్నట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి వెల్లడించారు. ఈ ఆంక్షల నేపథ్యంలో శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం చుట్టూ 10కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి రిమోట్ కంట్రోల్ డ్రోన్‌లు, పారా గ్లిడర్స్, మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్స్ వంటి వాటిని ఎగురవేయడం నిషేధమని సీపీ తెలిపారు. ఈనెల 10నుంచి జూన్ 9వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని, ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

నగరంలో పటాకులు పేల్చడంపై ఆంక్షలు

సిటీబ్యూరో, మే 10 (నమస్తే తెలంగాణ): భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్త వాతావరణం నేపథ్యంలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో పటాకులు పేల్చడంపై నిషేధాన్ని విధిస్తూ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటాకులు పేల్చడంపై ఆనంద్ కీలక నిర్ణయం తీసుకున్నారు. తక్షణమే నగరంలో బాణాసంచా కాల్చడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. సరిహద్దుల్లో పరిస్థితులు ఆందోళనకరంగా ఉండడం వల్ల ప్రస్తుత పరిస్థితుల్లో భద్రతా సిబ్బంది విధులకు భంగం కలగడంతోపాటు శత్రువుల కదలికలపై దృష్టి మరల్చే అవకాశం ఉన్నందున ప్రజలెవరూ పటాకులు పేల్చవద్దని కోరారు. ప్రత్యేకించి కంటోన్మెంట్ ప్రాంతంలో పటాకులు పేల్చడం వల్ల స్థానికులు భయాందోళనలకు గురయ్యే అవకాశం ఉందని, ప్రజల భద్రత, రక్షణ కోసం పటాకులపై నిషేధం విధించినట్లు ఆయన తెలిపారు. బాణాసంచా శబ్ధాలు.. పేలుళ్ల శబ్ధాలను పోలి ఉండడంతో ప్రజల్లో అనవసరమైన గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని, శాంతిభద్రతలు కాపాడడం, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ నిషేధాజ్ఞలు జారీ చేశారు. బహిరంగప్రదేశాల్లో, సమూహాల వద్ద, వేడుకల్లో కూడా పటాకులు పేల్చడంపై నిషేధం కొనసాగుతుందని, ఎవరైనా పటాకులు పేల్చినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఇదే క్రమంలో సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో కూడా పటాకులు పేల్చడంపై నిషేధం విధిస్తున్నట్లు ఆయా కమిషనరేట్ల పోలీసు అధికారులు తెలిపారు.